# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (IFR) నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొద్దిసేపటి క్రితం విశాఖపట్టణానికి చేరుకున్నారు.
- దేశంలో పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలియజేశారు.
- అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు రాష్ట్ర వార్షిక బడ్జెట్ పై శాసనసభలో చర్చ చేపట్టారు.
- రాష్ట్రంలో 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పిహెచ్‌సి) నిర్మాణం జరుగుతోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

=========================

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్-2026)కు ముఖ్య అతిథిగా హాజరు కానున్న నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొద్దిసేపటి క్రితం విశాఖపట్టణానికి చేరుకున్నారు. ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్ స్టేషన్ లో భారతీయ వాయుసేనకు చెందిన ప్రత్యేక విమానంలో నగరానికి విచ్చేశారు. విశాఖ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, స్థానిక పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, తూర్పు నావికాదళ అధికారులు స్వాగతం పలికారు. రేపు ఉదయం జరగనున్న ఫ్లీట్ రివ్యూ ఐ.ఎఫ్.ఆర్ లో సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి భారీ నౌకాదళ ప్రదర్శనను సమీక్షించనున్నారు.

=========================

గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ రెండో స్నాతకోత్సవ వేడుకలు జరుగుతున్నాయి. ఎయిమ్స్ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ప్రారంభమైన ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, గౌరవ అతిధిగా రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అనుప్రియ పటేల్ మాట్లాడుతూ.. దేశంలో పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య బీమా పథకమైన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

అంతకుముందు మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అహంతం శాంతా సింగ్ మాట్లాడుతూ... ఎయిమ్స్ లో అన్ని విభాగాల వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయని చెప్పారు. గడిచిన రెండేళ్లలో మంగళగిరి ఎయిమ్స్ వైద్య సేవల్లో అనేక విజయాలు సాధించిందని తెలిపారు.

========================

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు రెండు రోజుల విరామం అనంతరం తిరిగి ఈరోజు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శాసన సభలో రెండు బిల్లులు ప్రవేశ పెట్టారు. వీటిలో ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల మొదటి సవరణ బిల్లు-2026, ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల రెండవ సవరణ బిల్లు-2026 ఉన్నాయి. ఇక విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం సవరణ బిల్లు-2026 ను సభలో ప్రవేశపెట్టారు. ఆ తరువాత ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఇటీవల ప్రవేశపెట్టిన 3.32 లక్షల కోట్ల రూపాయల రాష్ట్ర వార్షిక బడ్జెట్ పై చర్చ చేపట్టారు. మరోవైపు సాంకేతిక సమస్య కారణంగా గంట ఆలస్యంగా ప్రారంభమైన శాసన మండలిలో ముందుగా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మంత్రులు ఆ ప్రశ్నలకు సమాధానాలిస్తుండగా తిరుమల కల్తీ నెయ్యి అంశంపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో చైర్మన్ మండలిని పలు మార్లు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తరువాత ప్రతిపక్ష సభ్యులు ప్రతిపాదించిన వాయిదా తీర్మానాన్ని మండలి చైర్మన్ మోషేను రాజు తిరస్కరించి నందుకు గానూ సభ్యులు మండలి నుండి వాకౌట్ చేశారు.

========================

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు రాష్ట్ర వార్షిక బడ్జెట్ పై శాసనసభలో చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు మాట్లాడారు. బడ్జెట్‌పై చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. ఈ బడ్జెట్ రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేదిగా ఉందని పేర్కొన్నారు. మూలధన వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా ఆస్తులు సమకూరుతాయన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని పెంచారని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 50 వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించడం ద్వారా ఇది నిజమైన రైతు ప్రభుత్వమని నిరూపించారని పుల్లారావు పేర్కొన్నారు.

విరామం

========================

రాష్ట్రంలో 194 కోట్ల రూపాయల వ్యయంతో 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పిహెచ్‌సి)ల నిర్మాణం జరుగుతోందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 1,144 పిహెచ్‌సిలు పని చేస్తున్నాయని, వాటికి సొంత భవనాలున్నాయని స్పష్టం చేశారు. మరో 88 పీహెచ్సీలను మంజూరు చేశామని, వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. శాసన మండలిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలకు సంబంధించి ఈరోజు పలువురు సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ... 12 పీహెచ్సీలకు కొత్త భవనాలు అవసరమని గుర్తించామని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలను మరింత చేరువ చేసేందుకు ఇటీవల 2 వేల 500 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిని నియమించామని, మరో 110 మంది డాక్టర్లను త్వరలో నియమిస్తామని తెలిపారు. వ్యక్తి ఆధారిత సేవలకోసం `సంజీవని` కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చారని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరిస్తూ…

(వాయిస్ 31 సెకన్లు)

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=========================

బాల్య వివాహ రహిత సమాజం కోసం కృషి చేయాలని.. ఇందుకు అవగాహన తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ స్పష్టం చేశారు. కొమరాడ మండలం తులసివలస, కిమిశీల గ్రామాల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులకు ఆయన ఈరోజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్య వివాహాల వలన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలు చేసినట్లయితే బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం వారికి రెండేళ్లు జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. అనంతరం గ్రామ మహిళలతో బాల వివాహ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు.

=========================

రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణలోకి వచ్చిందని హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆంధ్రా - ఒడిషా సరిహద్దులో గంజాయి నియంత్రణ అంశాన్ని పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ ప్రస్తావించగా, దానికి హోం మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గంజాయి రవాణా, సాగు చేసేవారిపై కఠిన చర్యలు చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి రవాణాను అరికట్టామని, గంజాయి సాగు, రవాణాపై నిరంతర నిఘా పెట్టామని హోం మంత్రి వెల్లడించారు.

=========================

పురుషుల టీ-20 ప్రపంచ కప్-2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా కెనడాతో జరిగిన మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన కెనడా జట్టు 4 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ కేవలం 2 వికెట్లను మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేధించింది. అదే విధంగా శ్రీలంకలోని పల్లకెలె వేదికగా ఐర్లాండ్, జింబాబ్వే జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో ఐర్లాండ్, జింబాబ్వేలకు చెరో పాయింట్ రావడంతో.. ఆస్ట్రేలియా ప్రపంచకప్ నుండి నిష్క్రమించింది.

=========================
=========================